# న్యూ(సెన్స్)స్ చానెల్




**మా**కాలనీ విలన్ శ్యామ్రావ్ కొంతమంది రాజకీయ నాయకులతో కలసి ఒక న్యూస్ చానెల్ స్టార్ట్ చేస్తున్నాడన్న వార్త గుప్పుమంది కాలనీలో.

ఆ మర్నాడే న్యూస్ పేపర్లో ప్రకటన కూడా వచ్చింది.

" నిప్పు అనే న్యూస్ చానెల్ త్వరలో ప్రారంభం! ఈ చానెల్లో పని చేయుటకు నీతి, నిజాయితీ ధైర్యసాహసాలే ఊపిరిగా గల జర్నలిస్ట్లు కావాలి.

మాకు జర్నలిజం క్వాలిఫికేషన్స్తో పనిలేదు. ఎవరయినా సరే! నిప్పులాంటి నిజాల్ని వెలికి తీసే వీరులయితే చాలు! దేశంలో ఎక్కడే అక్రమం జరిగినా, ఎక్కడే అన్యాయం జరిగినా క్షణాల్లో అక్కడ వాలిపోయి, దానికి సంబంధించిన వారందరినీ వెంటాడి వేటాడి సంచలనాత్మకమయిన నిజాలను వెలుగులోకి తెచ్చే వేడి రక్తం గలవారయి ఉండాలి. వారు జెంట్స్ అయిన ఫర్లేదు– లేడీస్ అయినా ఫర్లేదు–

ప్రకటనంతా ఇలాంటి కొరడా టైప్ డైలాగుల్తో నిండిపోయి ఉంది.

ఆ ప్రకటన చూడటంతోనే మా కాలనీ వాళ్ళంతా అర్జంటుగా గుమికూడిపోయారు.

"అసలు ఈ శ్యామ్రావ్ గాడికేం అనుభవం ఉందనీ వీడు చానెల్ పెడుతున్నాడు?" కసిగా అడిగాడు గోపాల్రావ్.

"మన ప్రెసిడెంట్‌కీ, గవర్నర్లకే అర్హతలేమీ అవసరం లేనప్పుడు ఈటీవీ ఛానెల్స్‌కేం ఏడుస్తాయ్?" అన్నాడు శాయిరామ్.

"ఆ శ్యామ్రావ్ కనీసం నాలాగా ఒక జర్నలిస్ట్ అయుండినా న్యూస్ చానెల్ పెడ్తున్నాడంటే అర్థం ఉంది. వాడికి పాలిటిక్స్‌లో ఏబీసీడీలు కూడా తెలీదు. ఏది న్యూస్ అయిటమ్– ఏదికాదు అనేది కూడా జడ్జ్ చేయటం తెలీదు– అలాంటివాడు..." అని గోపాల్రావ్ అంటూంటే రంగారెడ్డి కట్ చేశాడు.

"మనది డెమొక్రసీ నాయినా! ఒక టెర్రరిస్ట్ మనకు ప్రధానమంత్రి కావచ్చు. ఒక దొంగ లేక మర్డరర్ మనకు హోమ్ మినిష్టరవ్వచ్చు. కోట్లు తీసుకు సెటిల్‌మెంట్లు చేసే ఫాక్షన్ నాయకుడు ముఖ్యమంత్రి అవ్వచ్చు. తారా చౌదరి లాంటోళ్ళు పార్టీ పెట్టి పవర్‌లోకి రావచ్చు. కనుక నువ్వా అర్హతల గురించి ఉపన్యాసం ఆపెయ్"

దాంతో గోపాల్రావ్ సైలెంటయిపోయాడు.

ఈలోగా సావిత్రమ్మ, పార్వతీదేవి, యూత్ లీడర్ నవీన్ కాలనీ రచయిత చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్, కాలనీ సినీ హీరో జనార్ధన్ అందరూ గుంపుగా శ్యామ్రావ్ ఇంటివేపు వెళ్లటం కనిపించింది మాకు.

"ఎక్కడి కెళ్తున్నారు?" అడిగాడు శాయిరామ్.

"అదే 'నిప్పు' చానెల్లో న్యూస్ రీడర్ ఇంటర్వ్యూకి–" అంది సావిత్రమ్మ.

మేం ఉలిక్కిపడ్డాం

"మీరందరూ న్యూస్ రీడర్స్ అవుదామనా?"

"అందరం కాదు. జనార్ధన్, యాదగిరి జర్నలిస్ట్‌లు అవుతారుట– నేనూ, పార్వతీదేవీ, చంద్రమతీదేవీ న్యూస్ రీడర్స్ కోసం– బోసుబాబూ, నిసార్ కెమెరామెన్ అవాలనీ––" అంటూనే ఆగకుండా వెళ్ళిపోయారు వాళ్ళు.

"వీళ్ళకేం మెంటల్ రాలేదు కదా?" డౌటుగా అన్నాడు గోపాల్రావ్.

"గ్లామర్ ప్రపంచం బాబూ! మనదేశంలో టీవీ చూసే వాళ్ళకంటే టీవీలో కనిపించే జనాభా ఎక్కువ–" అన్నాడు శాయిరామ్.

"మనం కూడా వెళ్దామా?" అడిగాన్నేను.

వాళ్ళు షాకయ్యారు.

"ఎక్కడికి?"

"అదే 'నిప్పు'లో ఏదొక జాబ్ చేస్తే మనకూ బోలెడు గ్లామర్ వస్తుంది కదా! ఒకసారి నిప్పులో ఫేమస్ అయ్యామంటే అట్నుంచి అటు సినిమాల్లోకి కూడా వెళ్ళవచ్చు–"

"యూ ఆర్ రైట్–" అన్నాడు శాయిరామ్.

"అంటే నువ్వు కూడా నిప్పులో దూకుదామనా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

"నేనూ వెళ్తా! 'లక్' ట్రై చేసి చూద్దాం!" అన్నాడు రంగారెడ్డి కూడా–

"మీరంతా జాయినయితే ఇంక నేనొక్కడినీ దూరంగా ఎందుకుడాలీ? నేనూ వస్తా–" అన్నాడు గోపాల్రావ్.

మేము శ్యామ్రావ్ ఇంటికి చేరుకునేసరికే అక్కడ ఒక జాతర లాగా జనం నిండిపోయి ఉన్నారు.

ఆ జనాన్ని చూసి మిఠాయిబళ్ళూ, అయిస్క్రీమ్ బళ్ళూ, చాయ్ దుకాణాలూ అర్జంటుగా రోడ్ని ఆక్రమిస్తూ వెలిసినయ్.

ట్రాఫిక్ని కంట్రోల్ చేయడానికి పోలీసులు ప్రత్యక్షమయ్యారు.

మమ్మల్ని చూడగానే శ్యామ్రావ్ రెండో కొడుకు విఠల్రావ్ ఆప్యాయంగా పలుకరించాడు.

"హలో! ఏమిటిలా వచ్చారు? డాడీని కంగ్రాచ్చులేట్ చేయడానికా?" అడిగాడు కొంచెం మమ్మల్ని ఇన్సల్ట్ చేసే ధోరణిలో.

"అవును మరి! ఎంత చెడ్డా, మన కాలనీ వాడు న్యూస్ చానెల్ పెడుతున్నాడంటే గ్రేట్ కదా!" అన్నాడు శాయిరామ్.

అందరం వెళ్ళి శ్యామ్రావ్ని అభినందించాం.

"మన కాలనీలో చాలా మంచి టాలెంట్ ఉంది శ్యామ్రావ్! వాళ్ళందరూ నీ 'నిప్పు'కి ఒక అసెట్ అనుకో!" అన్నాడు గోపాల్రావ్ పెద్దమనిషి తరహాలో.

"అవునవును! కల్చురల్ ప్రోగ్రామ్స్లో చూస్తూనే ఉన్నాకదా!"

"చానెల్లో వర్క్ చేసే ఛాన్స్ దొరక్క అలా ఉన్నారుగానీ లేపోతే దుమ్ము లేపేవాళ్ళు–'

"అయ్నో– అయ్నో–" అతను కొత్తగా ఇంగ్లీష్ వాడటం మేము గమనించాం!

"ఆ ఒక్క పదం తప్ప ఇంకోటి వచ్చి ఉండదు! అందుకే దాన్నే రెండు సార్లు రిపీట్ చేస్తున్నాడు" అన్నాడు చంద్రకాంత్ నెమ్మదిగా.

"మరి మేమేమయినా అప్లికేషన్ లాంటిది నింపాలా?" అడిగాడు బోస్.

"డైరక్ట్గా ఇంటర్వ్యూ ఎటెండవటమే–" చిరునవ్వుతో న్నాడు శ్యామ్రావ్.

"అలాగా– అయితే మరి ఇంటర్వ్యూ ఎప్పుడు?"

"ఇప్పుడే– ఆ పక్కగదిలో కెళ్ళండి!"

అందరం ఆ పక్క హాల్లోకెళ్ళాం. అప్పటికే ఆ హాల్ హౌస్ఫుల్ అయిపోయింది.

శ్యామ్రావ్ భార్య అతని బామ్మర్ది, రోడ్లవెంబడి లావార్సీగా తిరుగుతూ చాలా ఫ్రాడ్ కేసుల్లో ఇరుక్కున్న అతని తమ్ముడి కొడుకూ, డిగ్రీ ఫెయిలయి ఒక రాజకీయపార్టీలో

చేరి వార్తల్లో కెక్కిన శ్యామ్రావ్ కూతురూ– వీళ్ళే ఇంటర్వ్యూ చేసేవాళ్ళు– మా వెనుకే శ్యామ్రావ్ కూడా వచ్చి వాళ్ళతో జాయినయాడు. అప్పటికే మా కాలనీలోనే ఉండే యువతిని ఇంటర్వ్యూ చేస్తున్నారు వాళ్ళు.

"చూడు శ్వేతా! నీ టేబుల్ మీదకు రకరకాల వార్తలు వచ్చి చేరాయ్ అనుకో! వాటిల్లో ఏ వార్తను మొదటి హెడ్లైన్గా టేకప్ చేస్తావ్?" అడిగింది శ్యామ్రావ్ భార్య.

"రాష్ట్రంలోని పొలిటికల్ హాట్ న్యూస్ని ఫస్ట్ టేకప్ చేస్తాన్సార్–" ఆ జవాబు వినగానే "గోవిందా – గోవింద" అన్నాడు శ్యామ్రావ్ చేతుల గాల్లోకెత్తి–

ఆ అమ్మాయి కంగారుపడింది–

"అదేంటి? అలా అన్నారు?" అడిగింది ఆశ్చర్యంగా.

"న్యూస్ అలా పొలిటికల్ వార్తతో స్టార్ట్ చేస్తే చానెల్ మట్టికొట్టుకుపోతుంది. నెక్ట్స్–" అన్నాడు శ్యామ్రావ్.

ఆ అమ్మాయి బిక్కమొగంతో బయటికెళ్ళిపోయింది.

ఇంకో కాండేట్ వచ్చి వాళ్లముందు నిలబడ్డాడు.

"అదేంటి ఆ అమ్మాయి చెప్పింది కరెక్టేగా? హాట్ పోలిటికల్ న్యూసే ఫస్ట్ హెడ్లైన్గా టెలికాస్ట్ చేస్తారెవరైనా–" అన్నాడు గోపాల్రావ్ మాతో నెమ్మదిగా.

"శ్యామ్రావ్ లెవల్ వేరు కదా మరి!"

అదే ప్రశ్న ఆ రెండో కాండేట్ నడిగింది శ్యామ్రావ్ భార్య.

"నేషనల్ లెవల్లో హాట్ న్యూస్ ఏదుంటే దాన్తో స్టార్ట్ చేస్తా మేడమ్–"

"రాంగ్–"

అతనూ బయటి కెళ్ళిపోయాడు.

సడెన్గా మా మధ్య నిలబడ్డ రంగారెడ్డిని పిలచాడు శ్యామ్రావ్.

"మీరు చెప్పండి రంగారెడ్డిగారూ! మీరు పెద్ద విమర్శకులు కదా– అన్ని టీవీ చానెల్సూ చూసి కామెంట్స్ కూడా చేస్తూంటారు–"

రంగారెడ్డి చిరునవ్వు నవ్వాడు.

"టీవీ చానెల్స్ చూసి చూసి మరీ రాటు తేలిన మాట నిజమే శ్యామ్రావ్–నేనే నీ నిప్పు చానెల్లో ఎడిటర్నయితే ఫస్ట్ హెడ్లైన్ ఏది సెలక్ట్ చేస్తానో తెలుసా? ఫ్రెష్గా జరిగిన రేప్ కేస్కి సంబంధించిన న్యూస్ అయిటమ్–"

శ్యామ్రావ్ ఆనందంతో తప్పట్లు కొట్టాడు.

"కరెక్ట్! యూ ఆరే జీనియస్! ఎందుకంటే వెధవ పోలిటికల్ న్యూస్ ఎవడికీ ఇంట్రెస్ ఉండదు. కేవలం రేప్ న్యూస్ అయితేనే అన్ని వయసులవాళ్ళూ ఆత్రుతగా, ఇష్టంగా

చూస్తారు. ఇంత కరెక్ట్‌గా ఎలా చెప్పగలిగావ్ రంగారెడ్డీ?"

"ఎలాగేముందీ? మన న్యూస్ చానెల్స్ అన్నీ కేవలం రేప్ వార్తలూ, వీడియో తీసిన సెక్స్ రాకెట్‌లూ, తారాచౌదరి లాంటివాళ్ళ సీక్రెట్ వీడియో క్లిప్పింగ్‌లూ, ఆశ్రమాల్లో స్వామీజీల సెక్స్‌లీలలూ– కేవలం వీటి వల్లే లాభాల్తో నడుస్తున్నాయ్. కనుక కొత్తగా ఎవడు చానెల్ పెట్టినా అదే ట్రెండ్‌లో వెళ్తాడు–"

"గుడ్! ఫర్‌ఫెక్ట్ ఎనలైజేషన్! ఒక కాలేజ్‌లో ఒక ప్రిన్సిపాల్ ఒక గాళ్ స్టూడెంట్‌తో సెక్సీ విన్యాసాలు జరిపినట్లు మనకో వీడియో మన వాళ్ళ స్టింగ్ ఆపరేషన్‌లో దొరికిందనుకోండి! ఆ న్యూస్ ఎలా ప్రెజెంట్ చేస్తారు?"

"ఆ వీడియోని బ్లర్ చేసి అందులో వాళ్ళమొఖాలు కనబడకుండా ప్లే చేయిస్తాం! జరిగిందంతా ఒక లేడీ వాయిస్‌ఓవర్‌లో డిటెయిల్డ్‌గా వినిపిస్తూంటుంది. ఆ తరువాత ఆ సంఘటన గురించి ఒక సెక్సాలజిస్ట్‌తో ఎనలైజ్ చేయిస్తాం.

ఆ తర్వాత ఒక హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్‌తో యంగ్‌గాళ్స్ ఎందుకలా బిహేవ్ చేస్తారు అనే అంశం మీద అరగంట ఇంటర్‌వ్యూ చేస్తాం–"

"ఒండర్‌ఫుల్!" తప్పట్లు కొట్టింది శ్యామ్రావ్ భార్య.

సడెన్‌గా అంతవరకూ కామ్‌గా కూర్చున్న శ్యామ్రావ్ కూతురు రంగారెడ్డి మీద ఇంకో ప్రశ్న సంధించింది.

"వాళ్ళ మొఖాలు ఎందుకు బ్లర్ చేయాలనుకుంటున్నారు?" బ్లర్ చేయకపోతే ఏమౌతుంది?"

రంగారెడ్డి చిరాగ్గా చూశాడు.

"చూడమ్మా! మనం బేసిక్‌గా మనుష్యులం! కనుక మనలో మావన లక్షణాలుండాలి! ఒక ప్రిన్సిపాల్– తన కాలేజ్‌లోని ఒక యంగ్‌గాళ్ స్టూడెంట్‌తో జరుపుతున్న సెక్స్ విన్యాసాలు యథాతథంగా చూపించటం వల్ల మన సొసైటీ తాలూకూ డెలికేట్ ఫాబ్రిక్స్ చిన్నాభిన్నం అవుతాయ్! ఎక్కడో ఒక ప్రిన్సిపాల్, ఒక గాళ్ స్టూడెంట్ అలా చేశారని అదంతా చూబిస్తే మిగతా ప్రిన్సిపాల్స్‌కీ గాళ్స్ స్టూడెంట్స్‌కీ ఇబ్బందికరంగా ఉంటుంది–"

శ్యామ్రావ్ రంగారెడ్డి స్పీచ్‌కి అడ్డుపడ్డాడు.

"చూడు రంగారెడ్డి– నేను న్యూస్ చానెల్ పెడుతోంది ప్రజలకు నీతి పాఠాలు చెప్పటాని క్కాదు. అలాంటి న్యూస్ ఎంత దారుణంగా, ఎంత ఎక్కువగా– ఎంత సెక్సీగా, ఎంత బట్టబయలుగా చూబిస్తే అంత వ్యూయర్ షిప్ వస్తుంది మనకి– వ్యూయర్ షిప్ ఎంతెక్కువ ఉంటే అంత లాభాలుంటాయ్– అల్టిమేట్‌గా మనం ఎంత సంపాదించాం అనేదే ముఖ్యం గానీ– దానివల్ల సమాజానికి ఎంత నష్టం జరుగుతోంది? మనం చూపించే దృశ్యాల వల్ల

యువత చెడు మార్గాన్ని పడుతోందిలాంటి బొంగులో కబుర్లు మాకవనసరం– అర్థమ యిందా?"


"ఇదెప్పుడో అర్థమయింది కాబట్టి మీ బొంగులో చానెల్లో నాలాంటి వాళ్ళు పనిచేయ కూడదని మావాళ్ళకు చెప్పడానికొచ్చా–" అనేసి వెళ్ళిపోయాడు రంగారెడ్డి.

ఆ తరువాత యాదగిరి వచ్చాడు.

"ఇదిగో యాదగిరీ! నలుగురు ధనవంతుల కొడుకులు కలసి లగ్జరీ కార్లో మందు కొడుతూ రోడ్ల వెంబడి తిరుగుతూ – బస్‌స్టాప్‌లో నిలబడ్డ ఓ అమ్మాయిని కిడ్నాప్ చేశారు. వాళ్ళ కారుని తన స్కూటల్ మీద వెంబడించాడో యువకుడు. ఆ గ్యాంగ్ ఆ యువతిని రేప్ చేయబోతూంటే ఆ యువకుడు అడ్డుకునేసరికి అతనిని రివాల్వర్‌తో కాల్చారు. ఆ అమ్మాయిని అపస్మారకస్థితిలో వదిలేసి వాళ్ళు పారిపోయారు– ఇదీ మన కొచ్చిన న్యూస్– దీన్నెలా ప్రెజెంట్ చేస్తావ్?"

యాదగిరి చిరునవ్వు నవ్వాడు.

"చాలా ఈజీ కొశ్చెన్ రాభయ్! ముంగట ఆ పోరి హాస్పిటల్లో ఉంటది కదా! గాడకుపోయి కిడ్నాప్ ఎట్ల జరిగిందీ, ఆ నలుగుర్లో ముందెవరు రేప్ జేసిన్రు– రేప్ ఎట్లా జరిగిందీ ఎంతసేపు జరిగిందీ ఆ సమయంలో ఆ పోరి ఎట్ల ఫీలయింది – అన్నీ ఆ పోరి నడిగి రికార్డ్ జేస్తాం!"



హుషారుగా చెప్తూంటే శ్యామ్రావ్ భార్య అడ్డుపడింది.

"అదే హాస్పిటల్లో ఇంకో బెడ్మీద– అమ్మాయిని రక్షించడానికెళ్ళి గాయపడిన యువకుడున్నాడు కదా! అతనని కూడా ఇంటర్వ్యూ చేయవా?" అడిగిందామె.

యాదగిరి ఆమె వంక ఓ పురుగుని చూసినట్లు చూశాడు.

"ఆడా? ఆడితో ఇంటర్వ్యూ ఏంది? అదెవడిక్కావాలి? అడికేమయితే మన ప్రేక్షకుల కెందుకు? మన చానెల్స్ లెక్కలో రేప్ జరుగుతున్నప్పుడు అడ్డుపడినోడు విలన్! రేప్ జేసేటోళ్ళు మన చానెల్స్కి హీరోలు! మన కెమెరాలెప్పటికీ రేప్ జేసినోళ్ళ వెంటనే వుండాలె! ఆళ్ళు ఎట్లా కిడ్నాప్ ప్లాన్ జేసిందీ. ఎట్లా అంతకు ముంగట భీ గిసంటి యాక్టివిటీస్ జేసిన్రు– జేస్తే ఆ వీడియోలు వాళ్ళతానున్నావా, ఆళ్ళ జీవిత చరిత్రలేంది? గిట్ల దినమంతా ఆళ్ళనే చానెల్లో చూబించాలె! అప్పుడే మొత్తం పబ్లికంతా మన చానెల్ జూస్తారు–"

"యూ ఆర్ సెలెక్టెడ్–" ఆవేశంగా అరచాడు శ్యామ్రావ్.

"ఏంది బే– నన్ను సెలక్ట్ జేసుగున్నావా? థూ నీయవ్వ! గిసంటి నీతీ నిమయాల్లేని ఛానల్ల పని జేయనికి నేనేం నంగా బాడుకవ్నా బే! సమాజం ఏమయితే నాకేంది– నేను బ్లాక్మెయిల్ జేస్తా– నా చానెల్ వ్యూయర్షిప్కోసం బ్లూఫిలిమ్స్ భీ చూపుతా అనేటోళ్ళ చానెల్ల నేను పన్జేస్తాను? థూ! దానికంటే అడుక్కు తినడం మంచింది– థూత్తేరీకీ–" అంటూ ఆవేశంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

కొద్దిక్షణాల తర్వాత తేరుకున్న మా వాళ్లందరూ పెద్ద ఎత్తున్న తప్పట్లు కొట్టి బయటకు నడిచారు.

ఆ రాత్రి అందరం కాలనీ వేదిక దగ్గర సమావేశమయ్యాం! మా కాలనీ యూత్ కిషన్రావ్ శ్యామ్రావ్ 'నిప్పు' న్యూస్ చానెల్ మహాభారత్ కాలంలో ఉండి ఉంటే– ఆ కవరేజ్ ఎలా ఉండేదో మిమిక్రీ చేసి చూపిస్తున్నాడు.

"ప్రేమక్షలకు 'నిప్పు' స్వాగతం! నా పేరు తార!

ఇప్పుడే అందివ వార్త! కౌరవుల దర్బార్లో దుశ్శాశనుడు పాండవుల భార్య అయిన ద్రౌపది చీర విప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ దృశ్యాన్ని మీకు ప్రత్యేకంగా చూపించడానికి మా జర్నలిస్ట్ రాజు, కెమెరామెన్ దిగంబర్ ఆ దర్బార్లో ఉన్నారు. అక్కడ ప్రస్తుత పరిస్థితేంటో స్వయంగా మా జర్నలిస్ట్ రాజునే అడిగి ప్రత్యక్షంగా తెలుసుకుందాం!

అనగానే కెమెరా కౌరవుల రాజ దర్బార్లో ఓపెనయింది. ద్రౌపది క్లోజ్లో కెవ్వున కేక వేసింది. జూమ్ చేస్తే ద్రౌపది చీరను వికటాట్టహాసంతో లాగేస్తున్నాడు దుశ్శాసనుడు. దర్బార్లో ఉన్న వారంతా షాకయిచూస్తూంటే కౌరవుల గాంగ్ మాత్రం "మహత్తరం! దుశ్శాసనా మహత్తరం!" అంటూ ఆనందోత్సాహాలతో అరుస్తున్నారు.

వెంటనే న్యూస్ రీడర్ గొంతు ఖంగునమోగింది.

"రాజూ! ఇప్పుడా కౌరవ సభలో ఏం జరుగుతోంది!"

"తారా! ప్రస్తుతం సభంతా హోరెత్తిపోతోంది. దుశ్శాసనుడు ప్రతిపక్షాల కేకలు, నిరసనల మధ్య ద్రౌపది చీరను లాగేస్తున్నాడు తారా! నిండు సభలో ద్రోణాచార్యులు, కృపాచార్యులవంటి పెద్దలు ఆ దృశ్యాన్ని షాకయి చూస్తున్నారు తార!"

"మరి ధర్మరాజూ అతని నలుగురు బ్రదర్స్ పరిస్థితేంటి రాజూ! వారీ సంఘటన గురించి ఏమంటున్నారు? ఎలాంటి ఫీలింగ్స్ వెలిబుచ్చుతున్నారు?"

"తారా! వాళ్ళంతా ఎంతో కోపంతో, ప్రతీకారవాంఛతో రగులుతున్నప్పటికీ– ధర్మరాజు గాంబ్లింగ్‌లో తనను తను కూడా లీగల్‌గా ఓడిపోయి ఉండడంతో– అందరూ సైలెంట్‌గా తలొంచుకున్నారు తారా! వాళ్ళందరి ఫీలింగ్సూ మనం కెమెరాలో స్పష్టంగా చూడవచ్చు తారా!"

అంటూండగానే కెమెరా పాండవుల మొఖాల మీదకు జూమ్ అయి పాన్ అవుతోంది.

"రాజూ! మన చానెల్ ప్రేక్షకులకు కావలసింది పాండవుల ఫీలింగ్స్ కాదు. ద్రౌపది వస్త్రాపహరణం సీన్ చూడ్డానికే ఉవ్విళ్ళూరుతున్నారు. వెంటనే కెమెరా ద్రౌపది మీదకు ఫోకస్ చేయించు–"

"అలాగే తారా! ఒక్క క్షణం! హలో ధర్మరాజుగారూ! మీ అయిదుగురు బ్రదర్సూ కొంచెం అవతలకి జరుగుతే ద్రౌపది వస్త్రాపహరణం సీన్ మా చానెల్ ప్రేక్షకులకు క్లియర్‌గా కనబడటానికి వీలవుతుంది! ప్లీజ్! అర్జునుడుగారూ– మీరు కూడా ఆ మూలకెళ్ళి నిలబడండి! హలో భీముడుగారూ– మీరు కూడా ఓ– థాంక్యూ–"

"థాంక్యూ రాజూ! ఈ పరిస్థితిలో ద్రౌపది ఫీలింగ్సేమిటో మన ప్రేక్షకులకు తెలియజేస్తే వాళ్ళెంతో ఆనందిస్తారు రాజూ–"

"వన్ మినిట్ తారా! హలో– ద్రౌపదిగారూ! దుశ్శాసనుడు ఇలా నిండు సభలో మీ చీర లాగేస్తూంటే మీకెలా అనిపిస్తోంది? మీ ఫీలింగ్సేమిటి?"

"నిండు సభలో ఆ దుర్మార్గుడు చీరలాగేస్తూ, వివస్త్రను చేయడానికి ప్రయత్నిస్తూంటే ఏ ఆడదానికయినా ఎలాంటి ఫీలింగ్స్ ఉంటాయో నీకు తెలీదంట్రా! పైగా ఈ సభలో కొలువు తీరి ఉన్న దుర్మార్గులు చాలానట్లు ఈ సీన్ దేశమంతా కూడా చూపించడానికి మీకు సిగ్గులేదూ? ఇది చాలనట్లు నా ఫీలింగ్స్‌ని కూడా మీ బోడి కెమెరాతో చెప్పుకోవాలా? మీరసలు మనుషులేనా?"

"తారా! ద్రౌపది మేడమ్ కొంచెం కోపంగా ఉన్నట్లున్నారు. ఆమె కోపం తగ్గాక తిరిగి ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేద్దాం! ఈలోగా ఈ సందర్భంగా ద్రౌపది భర్తల్లో

సీనియర్ అయిన ధర్మరాజుగారి ఫీలింగ్సేమిటో అడిగి తెలుసుకుందాం!

"నమస్కారం ధర్మరాజుగారూ–"

"ఊ!"

"సార్– మీ మిసెస్ ద్రౌపది గారిని నిండు సభలో ఆ దుశ్శాసనుడు చీరనులాగుతూ వివస్త్రను చేయడానికి ప్రయత్నిస్తున్నాడు కదా! ఈ సందర్భంలో మీరెలా ఫీలవుతున్నారు? అయ్‌మీన్ మీకేమనిపిస్తోంది?"

సడెన్‌గా ధర్మరాజుకి బదులు భీముడు మాట్లాడాడు ఆవేశంగా.

"ఒరేయ్– ఆ సీనే నీ పెళ్ళానికి జరుగుతుందనుకో! అప్పుడు నీ ఫీలింగ్స్ ఎలా వుంటాయ్ రా? ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతావంట్రా? ఈ సమయంలో ఒక నీతి నియమాలున్న భర్తగా మా అన్నగారి ఫీలింగ్సెలా ఉంటాయో నీకు తెలీదంట్రా!"

"తారా! భీముడు కొంచెం కోపంగా రియాక్టవుతున్నారు! అందుకని వారి రియల్ ఫీలింగ్స్ తెలుసుకోవటం కష్టంగా ఉంది తారా!"

"ఏం ఫర్వాలేదు రాజూ! నిప్పు ఛానెల్ ప్రేక్షకులకో గమనిక! పాండవుల ఫీలింగ్స్ ఎలా ఉంటాయో వెంటనే ఊహించి మా ప్రేక్షకులు మాకు ఎస్సెమ్మెస్ పంపించండి! ఎస్సెమ్మెస్ పంపించాల్సిన నెంబర్ 420420!

రాజూ! ద్రౌపది చీర అలా ఎంతసేపు లాగుతాడా దుశ్శాశనుడు! ఈ సమయంలో దుశ్శాశనుడు ఫీలింగ్సేమిటి?"

"హలో దుశ్శాశనుడుగారూ– నమస్కారం"

"హహా నమస్తే– నమస్తే– మీదే చెత్త చానెల్‌లో నాకు తెలీదుగానీ ఇలాంటి అద్భుతమయిన సీన్లు ఒక్క కెమెరాతో షూట్ చేస్తార్రా ఎవరయినా? అరడజను కెమెరాలు ద్రౌపదిని కవర్ చేయాలి–!"

"థాంక్యూసర్– ఇంకో రెండు కెమెరాలు మావాళ్ళ జేబుల్లో ఉన్నాయ్! ఎందుకంటే ఇలాంటి దృశ్యాలు సీక్రెట్‌గా వీడియో తీయటం మా చానెల్ వాళ్ళ జన్మహక్కు! ఆ విధంగా బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం మాకుంటుంది! ఎనీవే– ఇప్పుడు మీరు ద్రౌపదిగారి చీర లాగేస్తున్నారు కదా! ఈ సమయంలో మీ ఫీలింగ్సెలా ఉన్నాయ్? ఎలా ఫీలవుతున్నారు?"

"అదికూడా అడగాలా! నా మొఖం చూస్తే తెలీటంలా! అహ్హాహ్హా! ఇంత సంతోషంగా నా జన్మలో ఎప్పుడూ లేను– ఎందుకంటే ఇలా ఆడాళ్ళందరి చీరలూ లాగేయాలని నేను చిన్నప్పటి నుంచీ కలలు కంటున్నాను– చివరకు నా కల ఇలా ఇంతమంది ప్రేక్షకులు, శ్రేయోభిలాషులు, అభిమానుల మధ్య పైగా ప్రభువుల సమక్షంలో తీరటం ఎంతో ఎగ్జయిటింగ్‌గా ఉంది."

"థాంక్యూ దుశ్శాశనుడు గారూ!"

"రాజూ– ఇప్పుడో చిన్న బ్రేక్! బ్రేక్ తర్వాత కూడా ద్రౌపదీ వస్త్రాపహరణం సీన్ కంటిన్యూ అవుతుంది. పైగా చీరలో చాలా భాగం దుశ్శాశనుడు ఇప్పటికే లాగేశాడు గనుక ఇకముందు ఈసన్నివేశం పతాకస్థాయికి చేరుతుంది. కనుక ఎవరూ చానెల్ మార్చవద్దు! కంటిరెప్పలు మూయవద్దు!

"నేడే కొనండి అందనా వారి పట్టుచీరలు! పదికాలాల మన్నికకూ పదిమంది లాగినా ఇంకా ఎన్నో గజాలు మిగిలి ఉండే మహా భారత్ చీరలు! స్వయంగా దుశ్శాశనుడి కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ చీరలు నేడే మీ స్వంతం చేసుకోండి! ఈ చానెల్లో ఈ సీన్ పూర్తాయేలోగా ఫోన్ ద్వారా మాకు ఈ చీరలు ఆర్డర్ చేసిన వారికి యాభైశాతం డిస్కౌంట్! ఇప్పుడే మా సెల్‌ఫోన్లకు రింగవ్వండి– అందనా చీరలు– అందనా చీరలు– అందనా చీరలు–

"ద్రౌపది విరబోసుకున్న శిరోజాల కన్నా వత్తుగా, పొడుగ్గా పెరిగే శిరోజాల కోసం గాంధారి కొబ్బరినూనెనే వాడండి! మూడు నెలల్లో వత్తుగా పెరిగే పొడుగాటి శిరోజాలు మీ స్వంతం చేసుకోండి! పది బాటిల్స్ కొనేవారికి ఒక అందమయిన సవరం ఉచితం–"

"ఈ ద్రౌపదీవస్త్రాపహరణం సీన్ స్పాన్సర్ చేస్తున్నవారు దృతరాష్ట్ర ఎంటర్‌ప్రైజెస్! మీ అందచందాలను ఇనుమడింపజేసేందుకు నేడే కొనండి ఇంటర్నేషనల్ మేకప్ కిట్! ఒక్కొక్క బాక్స్ ఖరీదు కేవలం డెబ్భయ్ తొమ్మిది వేలు మాత్రమే–"

"వెల్‌కమ్ బాక్ టు ద్రౌపదీ వస్త్రాపహరణం! రాజూ! ఇంటర్‌వ్యూ కంటిన్యూ చెయ్–"

"ఓకే తారా ! దుశ్శాశన్‌జీ! మీ కల నెరవేరబోతూన్న ఈ సందర్భంలో మనదేశ యువతీ యువకులకు మీరిచ్చే సందేశం ఏమిటి?"

"మనదేశంలోని యువతీ యువలకులందరూ కూడా నాలాగానే అద్భుతమయిన సంస్కృతి నలవర్చుకుని, ఇంతకన్నా కూడా మరెన్నో రెట్లు ముందుకుపోవాలి! ఎన్ని అడ్డంకులెదురయినా మొత్తం చీరను లాగేసి పట్టుదలతో మనం అనుకున్నది సాధించాలి!"

"థాంక్యూ దుశ్శాశన్‌జీ!"

"రాజూ! ఈ ఉత్సవంలో భాగం పంచుకుంటున్న మహారాజు దృతరాష్ట్రుల వారెలా ఫీలవుతున్నారు?"

"ఇప్పుడే తెలుసుకుందాం తారా! నమస్తే దృతరాష్ట్రాజీ–"

"నమస్తే ఎవరు నాయినా నువ్వు?"

"నిప్పు టీవీ చానెల్ విలేఖరినండీ!"

"నిప్పా? ఈ పేరెప్పుడూ లేదే?"

"కొత్తగా వచ్చిన చానెల్ సార్ మాది! అయినాగానీ ప్రస్తుతానికి నెంబర్ టూ స్థానానికి చేరుకుంది. తెలుగు ప్రేక్షకులు అంత గొప్పగా అభిమానిస్తున్నారు మా చానెల్‌ని!"

"సంతోషం నాయినా! అంతమంది అభిమానిస్తున్నారంటే ఖచ్చితంగా మీ చానెల్ కూడా అశ్లీల అభ్యంతరకర దృశ్యాలనే నమ్ముకుని ఉంటుందని నాకర్థమవుతోంది-"

"అవున్సార్- అశ్లీలాన్ని మేము మిగతా చానెల్స్ కంటే ఎక్కువ వెరయిటీగా చూబిస్తాం సార్! ఉదాహరణకి మిగతా చానెల్స్ లేటెస్ట్‌గా జరిగిన ఒక రేప్ సీన్ చూబించారనుకోండి! మేము దాంతోపాటు గత పదేళ్ళుగా పట్టుబడ్డ సెక్స్ రాకెట్స్ క్లిప్పింగులూ, సెన్సార్ వాళ్ళు బాన్ చేసిన సినిమా రేప్ సీన్లూ- అన్నీ నెలరోజుల పాటు రాత్రింబగళ్ళు చూబిస్తాం- సార్- మీకు తెలీదేమో- మొన్న ఒక ఫోటో స్టూడియోవాడు అక్రమంగా తీసిన ఒక సెక్స్ వీడియో మొత్తం మా ఛానెల్లో చూబిచ్చేశాం సార్- మీరూ చూసే ఉంటారది-"

"ఆ ఒక్క విషయంలో నేనూ నా మిసెస్ అదృష్టవంతులం నాయినా! అలాంటి నికృష్టమయిన సీన్లు ఇరవై నాలుగ్గంటలూ చూడకుండా భగవంతుడు మాకు చూపు ఇవ్వలేదు-"

"ధృతరాష్ట్రాజీ! ఈ ద్రౌపదీ వస్త్రాపహరణం నిజానికి మీ అంగీకారంతోనే జరుగుతోంది కదా! దీన్ని గురించి మీ ఫీలింగ్సేమిటి?"

"కొడుకుల మాట కాదనే వయసు కాదు నాది! వారి ఆనందమే నా ఆనందంగా బ్రతుకువెళ్ళి దీస్తున్నవాడిని! కనుక వారి ఫీలింగ్సే నా ఫీలింగ్స్ కూడా! అయినా లోలోపల ఎంతో విచారంగా ఉంది-"

"విచారమా? అంటే పాపం ద్రౌపదికి ఇలా నిండు సభలో జరుగుతోన్న అవమానం గురించా?"

"ఏడ్చావ్! ఇలాంటి సీన్- ప్రత్యక్షంగా చూసి ఎంజాయ్ చేసేందుకు నాకు కళ్ళులేక పోవటం ఎంతో లోటుగా ఫీలవుతున్నా!"

"థాంక్యూ రాజూ! ఇప్పుడు మా చానెల్ ప్రేక్షకులకో సవాల్!

కౌరవులు కమ్ దుశ్శాసనడు పాండవుల మీద రివెంజ్ కోసం ద్రౌపదిని నిండు సభలో చీరలాగివేయటం సరైనదే అని మీరు ఫీలవుతున్నారా? లేక దుశ్శాశనుడు చేస్తున్నది తప్పని మీరు భావిస్తున్నారా? వెంటనే మీ సమాధానం ద్రౌపదిచీర అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి- సమాధానంకై- 420420కి ఎస్సెమ్మెస్ చేయండి!

"రాజూ లేటెస్ట్‌గా అక్కడి పరిస్థితేంటి? ద్రౌపది చీరలాగి వేసే కార్యక్రమం అఖది దశకొచ్చిందా?"

"తారా! ఇప్పుడిక్కడొక అనుకోని ట్విస్ట్ సంభవించింది తారా! వెంటనే దాన్ని బ్రేకింగ్



న్యూస్‌గా చూపించు! అదేంటంటే శ్రీకృష్ణుడే స్వయంగా గాల్లో ఎగుర్తూ వచ్చి మొత్తం చందన, బొమ్మన లాంటి చీరల షాపుల్లోని చీరలన్నీ కలిపిన దానికంటె పెద్ద చీర తీసుకొచ్చి ద్రౌపది చీరకు జాయిన్ చేశాడు తారా!

ఇప్పుడిక దుశ్శాశనుడు ఆ చీరనులాగడానికి వందేళ్ళు పడుతుందని సభలో కొలువు తీరియున్న పెద్దలు బాహాటంగానే అనుకోవటం వినబడుతూనే ఉంది తారా–"

"థాంక్యూ రాజూ– బ్రేకింగ్ న్యూస్! ఇప్పుడే మా చానెల్‌కి మాత్రమే ప్రత్యేకంగా అందిన వార్త!

ద్రౌపదీ వస్త్రాపహరణం సన్నివేశంలో ఉత్కంఠకు తెరదించుతూ శ్రీకృష్ణుడు ప్రపంచంలో అతిపెద్ద చీరను ద్రౌపది చీరకు జాయింట్ చేసి గిన్నిస్ బుక్‌లో రికార్డ్ నెలకొల్పడం జరిగింది– రాజూ – ఇప్పుడు దుశ్శాశనుడేమంటున్నాడు? శ్రీకృష్ణుడు తన కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నందుకు ఏ విధంగా స్పందిస్తున్నాడు? చీరలాగే కార్యక్రమాన్ని వాయిదావేస్తున్నాడా? ఈ వివరాలన్నీ తెలుసుకునేలోపు హైద్రాబాద్‌లో ఇప్పుడే అందిన మరో మినిష్టర్ సెక్స్ కుంభకోణం వీడియోతో ప్రేక్షకుల కనువిందు చేయబోతున్నాం–!"

మొత్తం ఆ ఆవరణంతా తప్పట్లతో మార్మోగిపోయింది–

"చానెల్ హెూతో ఐసా" అంటోంది చంద్రమతీదేవి.

* * * * *